# 10. చూడడమనే కళ

- జిడ్డు కృష్ణమూర్తి

## చదవండి - ఆలోచించండి - చెప్పండి

పూర్వం ఒక రాజుగారికి ఇద్దరు మంత్రులు ఉండేవారు. రాజు అన్ని విషయాల్లో పెద్దమంత్రినే సలహా అడిగేవాడు. అది చిన్నమంత్రికి నచ్చేది కాదు. అతనికి పెద్దమంత్రి గొప్పదనాన్ని తెలియజెప్పాలనుకున్నాడు.

ఒకరోజు తన ఇంటి వెనుక హడావుడి ఏమిటో చూసి రమ్మని చిన్నమంత్రితో రాజు అన్నాడు. చూసివచ్చి 'కుక్క ఈనిం'దన్నాడు చిన్నమంత్రి. 'పిల్లలెన్ని' అన్నాడు రాజు. మళ్ళీ వెళ్ళివచ్చి 'నాలుగు' అన్నాడు. ఏ రంగులో ఉన్నాయన్నాడు రాజు. మళ్ళీ వెళ్ళివచ్చి 'రెండు నలుపూ, రెండు గోధుమరంగు'లో ఉన్నాయన్నాడు.

ఇంతలో పెద్దమంత్రి వచ్చాడు. అతన్ని కూడా అడిగితే ఒకేసారి చూసి వచ్చి, రాజు అడిగిన ప్రశ్నలన్నిటికీ సమాధానమిచ్చాడు. పెద్దమంత్రి గొప్పతనం అర్థమైన చిన్నమంత్రి సిగ్గుపడ్డాడు.

### ప్రశ్నలు

1. చిన్నమంత్రి ఒక్కొక్కసారి ఒక సమాధానాన్నే ఎందుకు చెప్పాడు?
2. పెద్దమంత్రి ఒకేసారి అన్ని విషయాలు చెప్పడానికి కారణమేమిటి?
3. ఇద్దరిలో పరిశీలనాశక్తి ఎవరికి ఎక్కువగా ఉంది?
4. మనం వేటి వేటిని జాగ్రత్తగా పరిశీలించాలి? ఎందుకు?

### ఉద్దేశం

వినడం, మాట్లాడడం, చూడడం, పరిశీలించడం శ్రద్ధ చూపడం వంటి జీవన నైపుణ్యాలను తెలియజేయడమే ఈ పాఠ్యాంశ ఉద్దేశం.

ఈ పాఠ్యభాగం జిడ్డుకృష్ణమూర్తి ఆంగ్ల రచన A Timeless Spring కు అరుణామోహన్ అనువాదమైన "అనాది స్రోతస్సు" లోనిది.

### విద్యార్థులకు సూచనలు

1. పాఠం చదవండి. తెలియని పదాలకు అర్థాలను తెలుసుకోండి.
2. చిత్రాలను చూసి, సందర్భాన్ని అనుసరించి, ఆలోచించి భావాన్ని గ్రహించండి.
3. పాఠంలో తెలియని విషయాలు గాని, తెలుసుకోవలసిన అంశాలు గాని మీ ఉపాధ్యాయుడితో చర్చించండి, తెలుసుకోండి.

© SCERT not to be republished



**సూ**ర్యోదయాన్ని, సూర్యాస్తమయాన్ని, విస్మయపరిచేవాటి రంగులను మీరెప్పుడయినా గమనించారా? నీటిపై ప్రతిబింబించే కాంతులను, పడవలోని బెస్తవారిని, ఆకాశంలో ఎత్తున గుండ్రంగా తిరుగుతున్న రాబందుల్ని, చెట్లలోని చిన్ని పక్షులను, ఒక్క ఆకుపైనే మెరుస్తున్న ప్రాతఃకాల భానుణ్ణి మీరు గమనిస్తారా? వీటిని మీరు చూస్తారా? “చూడడం అసాధారణ విషయాలలో ఒకటని తెలుసుకోండి.” చంద్రుడసలు లేనప్పటి ఆకాశాన్నిగాని, కేవలం ఒక వెండితునకలాగా ఆకాశంలో వేలాడుతున్నప్పుడుగాని నిజంగా మీరు చూస్తుంటారా? మురికినీ, మాలిన్యాన్నీ, పేదల హీనస్థితినీ చూస్తారా?! మనుషులెలా మాట్లాడేది, ఎలా నడిచేది, ఎటువంటి బట్టలు వేసుకునేది, వారి మర్యాదమన్ననలు, వారి కాఠిన్యం, మృదుస్వభావం, నిజంగా పట్టించుకుంటున్నారో, ఏదో తెచ్చిపెట్టుకున్న మర్యాదో మనం చూస్తూ తెలుసుకోవచ్చు. ఎలా చూడాలో, ఎలా పరిశీలించాలో, ఎలా వినాలో తెలియనప్పుడు జీవితంలో ఎప్పటికీ దేన్ని గురించీ నిజమయిన శ్రద్ధ చూపలేము.

శ్రద్ధ చూపడమంటే ఏమిటో మీకు తెలుసా? ఒక పెంపుడు జంతువును బాగా చూడడంలో, మీ బట్టల్ని సక్రమంగా ఉంచుకోవడంలో, స్నానంచేసి మిమ్మల్ని మీరు పరిశుభ్రంగా ఉంచుకోవడంలో శ్రద్ధ ఉండడం. తోటలో ఓ మొక్కను నాటి ఉంటే అది ఎక్కడ పెరుగుతున్నదో ఆ నేలలో ఎరువు వేయాలి. వర్షం లేనప్పుడు నిత్యం నీళ్ళుపోయాలి. కుక్క ఉంటే దాన్ని శుభ్రంగా దువ్వాలి. సరైన ఆహారాన్నివ్వాలి. బయట నడకకు తీసుకవెళ్ళాలి. ఏ జబ్బూ లేకుండా చూడాలి. శ్రద్ధ చూపడం అంటే ఇవన్నీ చేయడానికి అంటే మనుషుల పట్ల, జంతువుల పట్ల, మొక్కలపట్ల, వస్తువుల పట్ల స్పందన ఉండడం. శ్రద్ధ అంటే ప్రేమ అంటున్న ఆ లోతైనదానిలో నిజంగా ఒక భాగం. చిన్న చిన్న విషయాలపట్ల శ్రద్ధచూపడంలో ఇది ఆరంభమవుతుంది.

మీ చుట్టూ ఉన్న ప్రతిదాన్నీ – అంటే పక్షుల్ని, చెట్లను, పేదవారిని, మురికి రోడ్లను, ఆశ్రయంలేని ఆవులను, ఆకలితో జబ్బుతో ఉన్న కుక్కల్ని పరిశీలించకపోతే మీరు ప్రజ్ఞావంతంగా ఉండలేరు. వీటన్నిటినీ మీరు పరిశీలించకపోతే మిగిలినవాళ్లు ఎలా పెరిగి పెద్దయ్యారో అలాగే హృదయంలో ప్రేమలేకుండా పెరుగుతారు. చాలామందికి తమలో తాము మాత్రమే కేంద్రస్థానాలు, వారి చింత అంతా వాళ్ళ గురించే. వారి డబ్బు, హోదా, అధికారం, వారివారి విజయాలలోనే పూర్తిగా మునిగిపోయి ఉంటారు. వాళ్ళ ఆశయాలలో, వాళ్ళ గురువులలో, వాళ్ళ దేవుళ్ళలో, వాళ్ళ రక్షకులతో మునిగిపోయి ఉంటారు. అంతకుమించి వారిలో ఏమీ ఉండదు. వాళ్ళకు ఆస్తి చాలా ఉండొచ్చు. పెద్ద బిరుదులుండొచ్చు. అంతరంగంలో వాళ్ళకేమీ ఉండదు. ఎందుకంటే ఎలా చూడాలో వాళ్ళకు తెలియదు. నేనిది గట్టిగా చెప్తున్న మాట.

అందుకని మీరు చూసి తీరాలి. చూడండి. పరిశీలించండి. విమర్శించవద్దు. పోల్చవద్దు. ఇది ‘మంచిది అది చెడ్డది’ అనిగాని ‘ఇది సరయింది, అది కాదు’ అనిగాని చెప్పొద్దు. మీరెలా నడుస్తారో, ఎంత సిగ్గుపడతారో, నిరుత్సాహంగా ఉంటారో పరిశీలించండి. చిన్నవాళ్ళతో పెద్దవాళ్లు, మీతో మీ ఉపాధ్యాయులు ఎలా ప్రవర్తించేవారో, మీరందుకు ఎలా ప్రతిస్పందించేదీ పరిశీలించండి, జీవితంలో ప్రతిదాన్ని ఊరకే గమనించండి. గమనించడం, అసాధారణమైన విషయం. గమనింపు లోనుంచి ప్రజ్ఞ ఉదయిస్తుంది. గమనించడమెలాగో తెలిస్తే తత్వం, మతం వంటివాటిని గురించి క్లిష్టమైన పుస్తకాలు చదవనక్కరలేదు. ఎలా చూడాలో, ఎలా వినాలో, ఎలా మాట్లాడాలో తెలిస్తే అదంతా మీకళ్ళలోనే, చెవులలోనే, మీ నాలుకమీదనే ఉన్నదని అర్థమవుతుంది.

©SCERT not to be republished

మనుషులంటే నిజమైన ఆప్యాయత ఉన్నప్పుడు చూడడం, వినడమే గాక వాళ్ళ గురించి పట్టించుకోవాలి. మీరసలు ఎవరి గురించైనా పట్టించుకుంటారా? మీ తల్లిదండ్రులను లక్ష్యపెడుతున్నారా? మీ తల్లిదండ్రులకు మీ పట్ల శ్రద్ధ ఉన్నదా? శ్రద్ధగా ఉండడమంటే ఇతరులను బాగా చూసుకోవడం, దయగా ఉండడం, వారిపట్ల క్రూరంగా ప్రవర్తించకుండా చూసుకోవడం. మీరు సరిగా చూడకపోయినా, పరిశీలించకపోయినా ఎవరిపట్లా మీకు లక్ష్యం లేదన్నమాట.

పరిశీలించడమనే ఈ మొత్తం ప్రశ్నలోకి వెళ్ళనారంభిస్తే మీరు నిజంగా పరిశీలించలేకపోతుండడం తెలుసుకుంటారు. ఒక ప్రమాదం జరిగిందనుకోండి. అక్కడ చాలామంది సాక్షులున్నారు. చూసిన ప్రతి ఒక్కరూ ఒక్కొక్క రకంగా ఆ ప్రమాదాన్ని వర్ణిస్తారు. ఈ సాక్షులు చెప్పిన మాటలు ఒక్కొక్కరివి ఒక్కొక్కరకంగా ఉంటాయి. ఎందుకంటే అక్కడ నిజంగా జరుగుతున్నదేమిటో అసలెవరూ పరిశీలించరు. ఈ ప్రయోగం మీరు చేస్తే ఉన్నవాటిని ఉన్నట్లుగా చూడడం నిజానికి ఎంత కష్టమయిందో తెలుస్తుంది. అవి ఎలా ఉండాలని మీరనుకుంటారో అలా చూడడంగాదు. వికారంగా ఉన్నవాటిని అందంగా ఉంటే బాగుండును అనుకుంటారు. వీధిలో అసహ్యంగా ఉన్నవాటిని అంటే అడుక్కునే భిక్షగాండ్రనూ మీరు చూడాలనే అనుకోరు. కళ్ళుమూసుకోరేమోగాని వాళ్ళను చూడరు. ఎక్కడో చూస్తారు. పారిపోతారు.

ప్రతి దానిని ఉన్నది ఉన్నట్లుగా చూడడం ఒక కళ. లెక్కలు, చరిత్ర, భూగోళశాస్త్రం నేర్చుకోవడం ఎంత కష్టమో ఉన్నవాటిని ఉన్నట్లుగా చూడడం అంతే కష్టం. బయట నడుస్తూ వెళ్తున్నప్పుడు పేదల అశుభ్రతను, దైన్యాన్ని, రోడ్డుమీది బురదను, జబ్బుచేసిన కుక్కలను చూడరు.

ఇదంతా చూడడం ఆరంభించి ఉంటే ఏదో ఒకటి చేయకుండా ఉండరు. అదే చూడడంలోని అందం. చూడడమే చేయడం. నిజంగా చూస్తే, పరిశీలిస్తే, వింటే సరయినది ఏదో చేయకుండా ఉండలేరు. అయితే మనలో చాలామందిమి గుడ్డివాళ్ళం, చెవిటివాళ్ళం గాబట్టి ఏమీ చెయ్యం. ఏమైనా చేసినప్పటికీ అది ఒక ఊహ ప్రకారంచేస్తాం గనుక ఆ ఊహకు, ఆ చర్యకు మధ్య గూడా సంఘర్షణ ఉంటుంది. చూడడం, వినడం ఆరంభించి ఉంటే ఆ చూడడంనుండే, ఆ వినడంనుండే దానికి తగిన చర్య జరుగుతుంది.

ఒకరోజున, కొన్ని మాసాల కిందట, నేను స్విట్జర్లాండులో ఉన్నప్పుడు ఒక మిత్రునితోపాటు కారులో వెళ్తున్నాను. మా ముందు ఒక అమ్మాయి సైకిలుమీద వెళ్తూ అకస్మాత్తుగా దిగి సైకిలు తోసుకుంటూ నడుస్తున్నది. ఎందుకా అని గమనిస్తున్నాను. రోడ్డుమీద ఉన్న ఒక కాగితం ముక్కను తీసి దగ్గరలో ఉన్న చెత్తకుండీలో వేసి, మళ్ళీ



© SCERT not to be republished

సైకిలెక్కి వెళ్ళిపోయింది. నేను చెప్తున్నదానిలో ఉన్న ప్రాధాన్యత మీకర్థమయిందా? ఆ చిన్నపాపకు అలా చేయమని ఎవరూ చెప్పలేదు. రోడ్డును శుభ్రంగా ఉంచాలన్న భావంలో రోడ్డుమీద పడి ఉన్న కాగితం ముక్కను చూసినప్పుడు దాన్ని ఎత్తివేసింది. ఆ ప్రాంతాన్ని అందంగా ఉంచాలన్న స్వాభావిక భావమది.

మీరు గనుక చూస్తే, పరిశీలిస్తే, వింటే అప్పుడు తక్షణమే క్రియ జరుగుతుంది. పరిశీలించినప్పుడే విన్నప్పుడే చర్య తీసుకుంటారు. పరిశీలించడమెలాగో, వినడమెలాగో మీకు తెలిస్తే ఉన్నదాన్నంతటినీ మీరు గ్రహిస్తారు. పరిశీలించడం, వినడం నిజానికి ఒకటే. ఇదంతా ఒకే పని, కాబట్టి మీ చుట్టూ ఉన్నవాటిని గురించి తెలుసుకోండి. అది సహజంగా మిమ్మల్ని సున్నితంగా చేస్తుంది. మీరు (అంటే మీ శరీరం, మీ మొత్తం అస్తిత్వం పూర్తి మెలకువతో – జీవంతో) తొణికిసలాడతారు.

దయచేసి మీరిక్కడినుండి బయటకు వెళ్ళినప్పుడు ఎప్పుడైనా ఒక్కసారి ఇది ప్రయత్నించండి. పక్షులను, చెట్లను, అశుభ్రంగా ఉన్న వీధులను అన్నింటినీ చూడండి. మనుషులవంక చూడండి. మీ తల్లిదండ్రులవంక, ఉపాధ్యాయులవంక చూడండి. మీతో వారెలా మాట్లాడేదీ, ఏ మాటలు వాడేదీ చూడండి, వాళ్ళను విమర్శించవద్దు, ఎందుకంటే విమర్శను ఎవరూ ఇష్టపడరు. విమర్శించకుండా, అంచనావేయకుండా, నిరపేక్షతో ఊరక గమనించండి. మీరిలా చేస్తున్నప్పుడు వాళ్ళకు మీరు గమనించడం తెలుస్తుంది. దాని ప్రభావం వాళ్ళమీద చాలా ఎక్కువగా ఉంటుంది. మరింత జాగ్రత్తగా ఉండడం, అశుభ్రతను, అశ్రద్ధను తగ్గించుకుంటూ ఉండడం ఆరంభిస్తారు. దాని ప్రభావం మీమీద గూడా చాలా ఉంటుంది. రోజంతా మీరు పరిశీలిస్తూ వింటూ ఉంటే మీ శరీరం మీ మనసు ఎంతో సున్నితమవడం చూస్తారు. దానితో సహజమయిన క్రమశిక్షణలో ఉంటారు. క్రమశిక్షణ, సున్నితత్వం కలిసి ఉంటాయి. ఇవి చేయాలి మిగిలినవి చేయగూడదు అనుకుంటూ బలవంతంగా ఉండేవారు– ఉదాహరణకు ఉదయాన్నే త్వరగా లేచి వాళ్ళకిష్టంలేని పనులన్నీ చేస్తూ అదే క్రమశిక్షణనుకునేవారు– చాలా కఠినంగా ఉంటారు. కాని మీరు గమనిస్తూ, పరిశీలిస్తూ వింటూ ఉంటే స్వతస్సిద్ధంగా ఒత్తిడి లేకుండా అక్కడ ఒక క్రమత, సమన్వయత ఒక క్రమశిక్షణ సంభవమవుతుంది.

ప్రపంచంలో శాంతి ఉండాలంటే మీలో మీరు శాంతిగా ఉండాలి. ఈ పోటీ ప్రపంచంలో ఆనందంగా జీవించడంకోసం ముందు మీరు పోటీపడడం ఆపాలి. పోటీపడకుండా ఉండడం బహుకష్టమంటారు. చేస్తున్న పనిని ప్రేమించకపోవడంవల్లనే అలా ఉంటుంది. మీ పనిని మీరు ప్రేమిస్తూంటే మీకంటే ముందుకు ఎవరెళ్ళారో మీ వెనక ఎవరున్నారో పట్టించుకోరు. మీ సామర్థ్యాన్నంతా – అంటే మీ మనస్సును, హృదయాన్ని, మీ శరీరాన్ని అంతా – వెచ్చించి చేస్తారు.

ఎవరో ఒకరు చెప్పింది వినడం మీకు బాగా అలవాటయిపోయింది. మీ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెప్తుంటారు. గురువులూ చెప్తారు. ప్రజాభిప్రాయమూ చెప్తుంది. నిరంతరం ఏమి ఆలోచించాలో, ఏమి చేయాలో, వార్తాపత్రికలు, రేడియో, టెలివిజను అన్నీ చెప్తాయి. 'లేదు, నా అంతట నేను తెలుసుకోబోతున్నాను' అని చెప్పే సమయం మీకుండదు. ఎవరో మీకు ఎప్పుడూ చెప్తున్నప్పుడు ఏమవుతుందో తెలుసా? మీరసలు ఆలోచించరు. ఎవరో ఒకరు అన్నీ ఆలోచించి పెడుతుంటారు. వాళ్ళ ఆలోచనలను మాత్రలాగా మీరు మింగేస్తారు. వాటిని అర్థంచేసుకున్నామని మీరనుకుంటారు. అయితే మీరలా అర్థంచేసుకోరు.

మీ చిన్నతనంలో ఈ అసాధారణ ఊహాశక్తి ఉంటుంది. దాన్ని మీరు పెరుగుతున్నప్పుడు ఎందుకు పోగొట్టుకుంటారు? నదిని చూస్తున్నప్పుడు ఆ పడవలో మీరున్నట్లు, భయంకర తుఫానుల మధ్య తేలుతూ నదివైపు పోతున్నట్లు మిమ్మల్ని చిత్రించుకుంటారు. మీరేదో చరిత్ర చదువుతారు. దాని గురించి ఆలోచించేటప్పుడు ఎంతో

కల్పితమయినవాటిని ఊహిస్తారు. మేఘాన్ని చూస్తున్నప్పుడు మీకది ఒక మేడ. దాని మధ్యన మీరుంటారు. గాలి శబ్దం వింటే మీకు శ్రవణానందాన్ని కలిగించే సంగీతాన్ని వింటున్నట్లుంటుంది. పెద్ద పక్షిని చూస్తుంటే దానివీపుమీద కూర్చుని ప్రపంచమంతా చుట్టివస్తున్నట్లు ఊహిస్తారు. చాలా డబ్బున్నట్లు, పేరున్నట్లు లేదా అందరూ విని మెచ్చుకునే అద్భుతమయిన వ్యక్తన్నట్లు, మిమ్మల్ని ఊహించుకుంటారు. మీ చిన్నతనంలో అద్భుతమైన ఈ ఊహాశక్తి ఉంటుంది. పెద్దవారవుతున్నకొద్దీ అది పోతుంది. ఎందువల్ల?

(ఆలోచించండి).



## రచయిత పరిచయం



జిడ్డు కృష్ణమూర్తిగారు మే 12, 1895న ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా మదనపల్లెలో జన్మించారు. వీరు ఆంగ్లములో ధ్యానం, స్వేచ్ఛ, నీవే ప్రపంచం, గరుడయానం మొదలైన రచనలు చేశారు. కృష్ణమూర్తిగారు ప్రపంచ ప్రఖ్యాత తత్త్వవేత్త.

మనిషి తనంతటతానుగా భయం, కట్టుబాట్లు, అధికారం, మూఢవిశ్వాసాలనుండి విముక్తి చెందాలని బోధించారు. అసలైన విప్లవం రావలసినది హృదయపు లోతులలో. మనిషిలో సమూలమైన పరివర్తన కలగకపోతే ఈ యుద్ధాలు, ఈ హింసాకాండ, ఈ విధ్వంసం ఇట్లాగే కొనసాగుతూ ఉంటాయి. తనను తాను పూర్తిగా అవగాహన చేసుకుంటూ హృదయంతో స్పందిస్తూ జీవించటంలోనే పరివర్తన సాధ్యమౌతుంది. అని తన రచనల ద్వారా, ప్రవర్తన ద్వారా నిరూపించారు.

## పాఠంలోని ముఖ్యాంశాలు

- ఎలాచూడాలో, ఎలాపరిశీలించాలో, ఎలావినాలో తెలియనప్పుడు జీవితంలో ఎప్పటికీ దేనిగురించీ నిజమైన శ్రద్ధచూపలేము. శ్రద్ధచూపడం అంటే మనుషులపట్ల, మొక్కలపట్ల, జంతువులపట్ల, వస్తువులపట్ల స్పందన ఉండడం.
- పరిశీలించడంవల్ల మనలో ప్రజ్ఞ కలుగుతుంది. ప్రజ్ఞ ఉంటే అంతరంగంలో ఎలా దర్శించాలో తెలుస్తుంది. విమర్శనాత్మకంగా గమనించాలి,సరియైన లక్ష్యాన్ని నిర్దేశించుకొని గమనించాలి.
- వినడం, మాట్లాడడం, పరిశీలించడంపై స్పష్టమైన అవగాహన ఉండాలి.
- పరిశుభ్రతకు ప్రాధాన్యాన్నిస్తూ, క్రమశిక్షణాయుత జీవితాన్ని గడపాలి, అప్పుడే మనం నిత్యచైతన్యవంతులం అవుతాం.
- పరిశీలించడంలో క్రమం, సమన్వయం ఉండాలి. అప్పుడే క్రమశిక్షణ అలవడుతుంది.
- ప్రపంచశాంతిని కాంక్షిస్తూ ప్రతిదానికీ పోటీ పడకుండా ప్రేమాభిమానాలు పెంపొందించుకోవాలి.

© SCERT not to be republished

## ఇవి చేయండి

### I. అవగాహన- ప్రతిస్పందన

**అ) కింది అంశాల ఆధారంగా మాట్లాడండి.**

1. సూర్యోదయసమయంలో మీచుట్టూ ఉన్న ప్రకృతి ఎలా ఉంటుంది?
2. శ్రద్ధ చూపడం అంటే ఏమిటి?
3. ఎలా వినాలి? ఎలా మాట్లాడాలి?

**ఆ) కిందివాక్యాలు పాఠ్యాంశంలో ఎక్కడ వచ్చాయో గుర్తించి వాటి భావం రాయండి.**

1. బిడ్డను ప్రేమించడం అంటే ఆ బాబు, పాప సరయిన విద్యను పొందేటట్లు చూడడం.
2. పరిశీలించకపోతే మీరు 'ప్రజ్ఞావంతంగా' ఉండలేరు.
3. ప్రతి దాన్నీ ఉన్నది ఉన్నట్లుగా చూడడం ఒక కళ.
4. 'నా అంతట నేనే తెలుసుకోబోతున్నాను' అని చెప్పే సమయం మీకుండదు.
5. ఆ చిన్నపాపకు అలా చేయమని ఎవరూ చెప్పలేదు.

**ఇ) కింది పేరాను చదవండి- సమాధానాలు రాయండి.**

సర్ జగదీశ్‌చంద్రబోస్ బెంగాల్‌లోని విక్రంపూర్ అనే గ్రామంలో 1858 నవంబరు 30న జన్మించారు. మొక్కలు జంతువులపై గాఢమైన ఆసక్తి పెంచుకున్నారు. భౌతికశాస్త్రం అభ్యసించినప్పటికీ జీవశాస్త్రం అంటే ఆసక్తి ఎక్కువ. సొంతంగా ప్రయోగశాలను ఏర్పాటుచేసుకొని అనేక పరిశోధనలు చేశారు. మొక్కలను, జంతువులను, నిశితంగా పరిశీలించారు. మొక్కలకు కూడా ప్రాణం ఉందని కనుక్కొన్నారు. చెట్లు అర్ధరాత్రి నిద్రిస్తాయని ఉదయం 8 గంటల ప్రాంతంలో నిద్రలేస్తాయని చెప్పారు. మత్తుపదార్థాల ప్రభావం చెట్లపై కూడా ఉంటుందని నిర్ధారించారు.

1. జగదీశ్‌చంద్రబోస్ ఎప్పుడు ఎక్కడ జన్మించారు?
2. జగదీశ్ చంద్రబోస్‌కు జీవశాస్త్రం అంటే ఎందుకు ఆసక్తి?
3. చంద్రబోస్ తన పరిశోధనలో ఏమి కనుక్కొన్నారు?
4. చెట్ల మీద పరిశోధన చేసి నిర్ధారించిన విషయమేమిటి?

### II. వ్యక్తీకరణ - సృజనాత్మకత

**అ) కింది ప్రశ్నలకు ఐదు వాక్యాలలో సమాధానాలు రాయండి.**

1. ఎవరయినా దేన్నయినా నిజంగా పట్టించుకుంటున్నారో, ఏదో తెచ్చిపెట్టుకున్న మర్యాద ప్రదర్శిస్తున్నారో మనం చూస్తూ తెలుసుకోవచ్చు అని జిడ్డుకృష్ణమూర్తిగారు, అన్నారు. తెచ్చిపెట్టుకున్న మర్యాద అంటే ఏమిటి?
2. పరిశీలనకు, ప్రజ్ఞకు గల సంబంధాన్ని తెలపండి.
3. 'వల్లించడం' అంటే ఏమిటి? అది విద్యార్థికి ఉపయోగమా కాదా? ఎందుకు?
4. ప్రవర్తన అంటే ఏమిటి? అది ఎలా ఉండాలి?
5. శ్రద్ధ చూపడం అంటే ఏమిటి? విద్యార్థులు వేటిపట్ల శ్రద్ధచూపాలి?



© SCERT not to be republished

**ఆ) కింది ప్రశ్నలకు పదిహేను వాక్యాల్లో సమాధానాలు రాయండి.**

1. జీవితంలో 'క్రమశిక్షణ' అవసరం. ఎందుకో వివరించండి.
2. 'ప్రపంచంలో శాంతి' ఉండాలంటే ఏం చేయాలి? మీ అభిప్రాయం రాయండి.
3. చిన్నతనంలో ఉన్న ఊహాశక్తి పెద్దవారవుతున్నకొద్దీ ఎందుకు పోతుంది? ఆలోచించి రాయండి.

**ఇ) సృజనాత్మకంగా స్పందించండి.**

పాఠంలోని మొదటిపేరా ఆధారంగా చిత్రాన్ని గీయండి. దాని గురించి వర్ణించండి.

(లేదా)

మీ పాఠశాలలో 'ప్రపంచశాంతి' అనే అంశంపై మండలస్థాయి వ్యాసరచన పోటీ నిర్వహించాలని అనుకున్నారు. విద్యార్థులను ఆహ్వానిస్తూ కరపత్రం తయారుచేయండి.

**ఈ) ప్రశంసాత్మకంగా రాయండి.**

మీ పాఠశాలలో ఒక విద్యార్థి రాష్ట్రస్థాయి స్కౌట్స్ అండ్ గైడ్స్ జంభోరీలో పాల్గొని ముఖ్యమంత్రి చేతులమీదుగా బహుమతినందుకున్నాడు. అతణ్ణి అభినందిస్తూ పది వాక్యాలు రాయండి.

(లేదా)

మీ జిల్లాలో ఒక విద్యార్థి వ్యర్థంగా పారవేసిన వస్తువులతో అద్భుతంగా కళాఖండాలు తయారుచేశాడు. ఆ వార్తను మీరు పత్రికలో చూశారు. అతణ్ణి ప్రశంసిస్తూ పత్రికకు లేఖ రాయండి.

## III. భాషాంశాలు

### పదజాలం

**అ) ఇచ్చిన వాక్యాల ఆధారంగా కింద గీత గీసిన పదాలకు అర్థాలను గ్రహించి మరో వాక్యం రాయండి.**

1. <u>ఇంద్రధనుస్సులో</u> రంగులను చూస్తే <u>విస్మయం</u> కలుగుతుంది.
2. మనం ప్రతిరోజూ <u>ప్రాతఃకాలంలో</u> నిద్రలేవాలి.
3. వెన్నను చేతితో తాకితే <u>మృదువుగా</u> ఉంటుంది.
4. <u>ప్రవర్తన</u> సరిగాలేనివారు జీవితంలో కష్టాల్లోపడతారు.
5. ఆదర్శానికి ఆచరణకు <u>సమన్వయం</u> ఉండడం వాంఛనీయం.

**ఆ) కిందివాటిలో ఆత్మవిశ్వాసం ప్రకటించడానికి ఉపయోగపడే పదాలున్నాయి. వాటిని వేరుచేసి వాక్యాలు రాయండి.**

తనంతట తాను, దురదృష్టం, కాఠిన్యం, తెలుసుకోవడం, క్లిష్టం, నిజంచెప్పడం, అసాధారణం, పనిని ఇష్టపడడం, స్వతస్సిద్ధం.

**ఇ) కింది వాక్యాలలో ప్రకృతి పదాలను గుర్తించండి. వాటి ఎదురుగా వికృతులను ఎంపిక చేసుకొని రాయండి.**

1. ఆకాశంలో మబ్బులను చూశారా! ....................................
2. సరైన ఆహారాన్ని తీసుకోవాలి. ....................................
3. నెమలి జాతీయపక్షి. ....................................
4. ఉపాధ్యాయుడు బడిలో పాఠాలతోపాటు క్రమశిక్షణ నేర్పుతాడు........................

(వికృతి పదాలు: ఓగిరం, సంద్రం, పక్కి, దెస, ఒజ్జ, గారవం, ఆకసం, బాస, సాకిరి)

## వ్యాకరణం

**ఈ) కిందివాక్యాన్ని పరిశీలించి, అది ఏ రకమైన వాక్యమో గుర్తించండి. క్రియా భేదాలను కూడా గుర్తించండి.**

1. రమ రోడ్డుమీద ఉన్న ఒక కాగితం ముక్కను తీసి, దగ్గరలోనున్న చెత్తకుండీలో వేసి, మళ్ళీ సైకిలెక్కి వెళ్ళిపోయింది.
   అ) సామాన్య   ఆ) సంయుక్త   ఇ) సంశ్లిష్ట   (   )

**(పై వాక్యంలో ఉన్న అసమాపక క్రియలను రాయండి.)**

2. ఎక్కడ? ఎప్పుడు? ఎందుకు? ఎవరు? ఏమిటి? అనే పదాలను ఉపయోగించి ప్రశ్నార్థక వాక్యాలు తయారుచేయవచ్చునని మీకు తెలుసు. వాక్యం చివరలో 'ఆ' అనే ప్రత్యయాన్ని చేర్చి కూడా ప్రశ్నవాక్యంగా మార్చవచ్చు. ఇలాంటి ప్రశ్నా వాక్యాలను రకానికి ఒకటి చొప్పున మీ పాఠ్య పుస్తకం నుంచి ఉదాహరణలు వెతికి రాయండి.

ఉదా– దైన్యస్థితిని చూస్తారు + ఆ = దైన్యస్థితిని చూస్తారా?

3. ఒక వస్తువు స్వభావాన్ని/ధర్మాన్ని తెలిపే క్రియలను, నిత్య సత్యాలను తెలిపే వాటిని "తద్ధర్మ" క్రియలు అంటారు. ఉదయిస్తాడు, అస్తమిస్తాడు, ఎగురుతుంది మొదలైనవి. ఇలాంటి క్రియలను మీపాఠంలో వెతికి రాయండి.

**ఉ) రుగాగమసంధి**

పేద + ఆలు - పేద+ర్+ఆలు = పేదరాలు

పై రెండు పదాలకు మధ్య 'ర్' అనేది వచ్చి ప్రక్కనున్న 'ఆ' అనే అచ్చుతో కలిస్తే 'రా' అయింది. అదెలా వస్తుందంటే "పేద, బీద, బాలింత, ఇలాంటి పదాలకు 'ఆలు' అనే అనే శబ్దం పరమైతే ఇలా రుగాగమం(ర్) వస్తుంది. రెండు పదాలలో ఏ అక్షరాన్ని కొట్టివేయకుండా కొత్తగా అక్షరం వస్తే ఆగమం అంటారు.

**1. పేదాది శబ్దాలకు 'ఆలు' శబ్దం పరమైతే కర్మధారయంలో రుగాగమం వస్తుంది.**

పేద (విశేషణం) - ఆలు (స్త్రీ) (నామము)
విశేషణం - నామం
మనుమ + ఆలు = మనుమరాలు
బాలింత + ఆలు = బాలింతరాలు

**కర్మధారయంలో తత్సమపదాలకు ఆలు శబ్దం పరమైతే పూర్వపదం చివరనున్న అత్వానికి ఉత్వమూ, రుగాగమమూ వస్తాయి.**

ధీరురాలు = ధీర + ఆలు
(ధీర + ఉ + ర్ + ఆలు ) = ధీరురాలు
గుణవంత + ఆలు - గుణవంత + ఉ + ర్ + ఆలు; గుణవంతురాలు.
మరికొన్ని ఉదాహరణలు రాయండి.

**ప్రాజెక్టు పని**

మనచుట్టూ ఉండే ప్రతి ప్రాణిలో ఏదో ఒక గొప్పదనం ఉంటుంది. మీరు చూసిన పక్షుల, జంతువుల లక్షణాలను, ప్రత్యేకతలను పట్టిక రూపంలో రాసి ప్రదర్శించండి.

ప్రపంచంలో గల మేధావులందరికన్నా ఒక
మంచి హృదయం గల వ్యక్తి ఎంతో గొప్పవాడు.
– లిట్టన్

© SCERT not to be republished